వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 170
పేజీలు : 08 | వెల: రూ.5/-
గురువారం
ఏప్రిల్ 03, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




## ఎన్ పీడీసీఎల్ చైర్మన్ కు జ్ఞాపిక అందజేత

యువ ఐఏఎస్ అధికారి, టీజీ ఎన్ పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డికి వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి జ్ఞాపిక అందజేశారు. వరంగల్ వాయిస్ లో ప్రచురితమైన వరుణ్ రెడ్డి సక్సెస్ స్టోరీ కి సంబంధించిన జ్ఞాపికను గురువారం ఎన్ పీడీసీఎల్ కార్యాలయంలో అందజేసి అభినందనలు తెలిపారు.

– వరంగల్ వాయిస్, హనుమకొండ



వివరాలు 2లో..

# అక్రమ బ్లాస్టింగ్‌లు

పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాలు అక్రమ బ్లాస్టింగ్ లతో ఆగమాగమవుతున్నాయి. భారీ పేలుళ్లతో ఆ పల్లెలు దద్దిరిల్లుతున్నాయి. బ్లాస్టింగ్ వల్ల వచ్చే శబ్దాలతో జనం ఉలికి పడుతున్నారు. బండరాళ్లు ఎగిరి పడి గ్రామాల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. పంట పొలాల్లో పెద్ద పెద్ద బండ రాళ్లు పడి తీవ్రంగా పంట నష్టం జరిగినా కనికరం చూపించేవారు కరువయ్యారు. ఇప్పటికే ప్రకృతి సంపదను కొల్లగొట్టి గుట్టలను గుల్ల చేసిన గ్రానైట్ మాఫియా గ్రామాల్లోని గుట్టలను చదను చేసే పనిలో పడ్డారు. రాళ్ల కోసం ఇష్టానుసారంగా బ్లాస్టింగ్ లకు పాల్పడుతున్నారు. బ్లాస్టింగ్ లతో ఆ ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు కరువైంది. ఎటు నుంచి ఏ రాయి వచ్చి తగులుతుందోనన్న భయాందోళనలకు గురవుతున్నారు. అక్రమార్కులు ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ భారీ బ్లాస్టింగ్ లతో కోట్లకు పరుగెడుతుంటే నియంత్రించాల్సిన అధికారులు మొద్దు నిద్ర వీడడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అక్రమ వ్యాపారంలో అధికారులకూ భాగస్వామ్యం ఉందన్న ప్రచారం సాగుతోంది.

- వరంగల్ వాయిస్, డోర్నకల్

- ఆగమవుతున్న పల్లె జనం
- బీటలువారుతున్న ఇండ్లు
- గాయాల పాలవుతున్న స్థానికులు
- తీవ్రంగా నష్టపోతున్న పంట పొలాలు
- కన్నీరు పెడుతున్న రైతన్నలు



8లో..

## కాజీపేటపై చిన్నచూపు

- లోకో రన్నింగ్ డిపో సిబ్బంది అక్రమ బదిలీ
- పార్లమెంట్ లో గళమెత్తిన డాక్టర్ కడియం కావ్య




2లో..

## ఇక సమరమే

- స్థానిక సమస్యలపై ఉద్యమించాలి
- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి



2లో..

## జర్నలిస్టులకు న్యాయం చేస్తాం

- వారి చిరకాల ఆకాంక్షను నేరవేర్తుతాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, ఏప్రిల్ 03, 2025



# అక్రమ బ్లాస్టింగ్‌లు

- ఆగమవుతున్న పల్లె జనం
- బీటలువారుతున్న ఇండ్లు
- గాయాలపాలవుతున్న స్థానికులు
- తీవ్రంగా నష్టపోతున్న పంట పొలాలు
- కన్నీరు పెడుతున్న రైతన్నలు

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సంపాదనే లక్ష్యంగా అక్రమార్కులు బరితెగిస్తున్నారు. అక్రమ బ్లాస్టింగ్ లకు పాల్పడుతూ అందిన కాడికి దండుకుంటున్నారు. అడ్డూ అదుపూ లేకుంగా బ్లాస్టింగ్ లకు పాల్పడుతూ పల్లె వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ బ్లాస్టింగ్ లకు పాల్పడడంతో తద్వారా వస్తున్న దుమ్ము, ధూళితో ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తున్నా కనికరం చూపించడంలేదు. బ్లాస్టింగ్ శబ్దాలతో ఆ ప్రాంతం దద్దరిల్లుతూ యుద్ధ భూమిని తలపిస్తోంది. అక్రమ బ్లాస్టింగ్ లను ఆపాలంటూ స్థానికులు పలు మార్లు అధికారులను వేడుకున్నా ప్రయోజనం కానరావడం లేదు. ఎవరికి ఫిర్యాదు చేసినా తగ్గేదేలే అన్నట్లుగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎవరు అడ్డు వస్తారో చేస్తాం అన్నట్టుగా వ్యవహరిస్తూ పల్లె ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారు.

**పలు ప్రాంతాల్లో..**

డోర్నకల్ మండలంలోని బూరుగుపాడు శివారు దుబ్బతండా గ్రామపంచాయతీలో అక్రమ బ్లాస్టింగ్ లకు  పాల్పడుతున్నారు. కురవి మండలం బలపాల, మరిపెడ మండల శివారు సుబ్లెడు, తెల్దారుపల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులు ఇక్కడికి వచ్చి బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారు. టాక్టర్ కు అమర్చిన కంప్రెషర్ మిషిన్ ద్వారా రాళ్లకు రంధ్రాలు వేసి అందులో జిలెటిన్ స్టిక్స్ (కంకులు) అమర్చి మేకర్ బాక్స్ ద్వార పేల్లులకు పాల్పడుతున్నారు. వీటి శబ్ద ధాటికి పశువులు బెదిరిపోతుండగా రాళ్లు ఏగిరిపడి పలువురు గాయపడిన ఘటనలు ఉన్నాయి. భారీ శబ్దాలకు చుట్టుపక్కల ఉన్న ఇండ్లు బీటలు వారుతున్నాయి. వ్యవసాయం చేసుకునే రైతులు తండాలోని పశువులు, మేకలు, గొర్రెలను గుట్టపైనే మేతకు వదిలేసి, వ్యవసాయ పనులు చేసుకుంటారు. గుట్టపై బ్లాస్టింగ్ చేస్తూ రాయి తీస్తున్నారని, యంత్రాల ద్వారా రాయిని కోస్తుండటంతో వచ్చే దుమ్ము, దూళితో పాడి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్లాస్టింగ్ శబ్దాలకు పశువులు భయపడి పారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


**చర్యలేవి..**

బ్లాస్టింగ్ లతో బతకలేకపోతున్నామని పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేకుండా బ్లాస్టింగ్ పాల్పడుతున్నా అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమాలను అరికట్టాల్సిన అధికారులే చేష్టలుడిగి వ్యవహరిస్తే సామాన్యులకు రక్షణ ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అక్రమంగా బ్లాస్టింగ్ లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## జర్నలిస్టులకు న్యాయం చేస్తాం

- వారి చిరకాల ఆకాంక్షను నేరవేర్చుతాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

**వరంగల్ వాయిస్, కొత్తగూడ :** ప్రజా పాలనలోనే వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తామని, అదేవిధంగా వర్కింగ్ జర్నలిస్టుల చిరకాల ఆకాంక్ష ఇళ్ల స్థలాల మంజూరు సమస్యను కూడా పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. గురువారం టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కొత్తగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక శాసన సభ్యురాలు, రాష్ట్ర మంత్రి సీతక్కను ములుగు క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన వర్కింగ్ జర్నలిస్టులను గత పాలకులు అన్యాయాలకు గురి చేశారని ఆరోపించారు. కచ్చితంగా వర్కింగ్ జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇళ్ల స్థలాల మంజూరు, ఆరోగ్యశ్రీ, హెల్త్ కార్డుల మంజూరు, ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో విధి విధానాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కొత్తగూడ మండల అధ్యక్షుడు ఎస్ కె సల్మాన్ పాషా, జిల్లా నాయకులు శెట్టి పరశురాం, మహమ్మద్ అజ్మీర్, మండల ఉపాధ్యక్షులు గోగు విజయ్ కుమార్, దేశ వెంకటేశ్వర్లు, మండల ప్రచార కార్యదర్శిలు తీగల ప్రేమ్ సాగర్, ఈక నరేష్, ఉబ్బని శ్రీహరి, గంగిశెట్టి రాకేష్ వర్మ, ముఖ్య సలహాదారులు బొజ్జ సునీల్,  యూనియన్ నాయకులు చాపల శ్రీనివాస్, నాంపల్లి రాజ్ కుమార్, తాటి సుదర్శన్, బిక్షపతి, గట్టి సుధాకర్, అశోక్, దేవేందర్ పాల్గొన్నారు.



## మైనర్ బాలికపై అత్యాచారం..
### నిందితుడికి జీవిత ఖైదు

**వరంగల్ వాయిస్, క్రైం :** గత సంవత్సరం మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడగా బాలిక గర్భం దాల్చిన సంఘటనలో నిందితుడు గీసుకొండ మండలం, మనుగొండ గ్రామానికి చెందిన చాపర్తి సాంబయ్య (65)కు యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ వరంగల్ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.ప్రేమలతా రెడ్డి గురువారం తీర్పును వెల్లడించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కీలకంగా నిలిచిన కేసు దర్యాప్తు అధికారి మామూనూర్ ఏసీపీ తిరుపతి, అప్పటి స్టేషన్ ఇన్ స్పెక్టర్ బాబూలాల్, పీపీ రవికిరణ్, భరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ నీరజతో పాటు గీసుగొండ కోర్టు కానిస్టేబుల్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

## దొంగను పట్టిస్తే నజరానా..
### ప్రకటించిన వర్ధన్నపేట పోలీసులు

**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ఎస్బీఐలో వృద్ధురాలు నందనం భారతమ్మ గురువారం రూ.3 లక్షలు డ్రా చేసుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తి తన వాహనంపై మీ ఇంటివద్ద దింపుతా అంటూ మాయమాటలు చెప్పి స్కూటీ ఎక్కించుకున్నాడని వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్ తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని ఫిరంగడ్డ వైపు ఆపిన సదరు దొంగ వృద్ధురాలిని బెదిరించి డబ్బులు సంచి తీసుకొని పరాడయ్యారని వెల్లడించారు. దీంతో భారతమ్మ మహిళా పోలీసులను ఆశ్రయించగా వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దొంగను పట్టుకోవడానికి ప్రయత్నాలను ముమ్మురం చేశారు. సీసీ కెమెరాల ఆధారంగా దొంగ చిత్రాన్ని విడుదల చేశారు.  పట్టించిన వారికి రూ.10 వేలు నజరానా ప్రకటించారు. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామంటూ సీఐ శ్రీనివాస్ తెలిపారు.



## ఇక సమరమే

- స్థానిక సమస్యలపై ఉద్యమించాలి
- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర సమస్యలపై బీజేపీ సమర శంఖారావం పూరిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి ప్రకటించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అధ్యక్షతన ధర్మారంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి పదాధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఉద్యమ కార్యచరణ రూపొందించి ముందుకు వెళ్లాలన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, నిరుద్యోగ యువత ఇలా అన్ని వర్గాల ప్రజల సమస్యలపై పోరాడాలని తీర్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడతూ




కోట్లాది మంది భారతీయుల ఆకాంక్షలను నెరవేరుస్తూ, అనుక్షణం విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ.. ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించింది ఒక్క బీజేపీ మాత్రమే అన్నారు. ఏప్రిల్ 6 తేదీన బీజేపీ ఆవిర్భావ దినోత్సవం, సంస్థాగతంగా చేయవలసిన కార్యక్రమాలపై చర్చించారు. ఏప్రిల్ 11 జ్యోతిరావు పూలే జయంతి, ఏప్రిల్ 14 భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వారి విగ్రహాల వద్ద స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. మండలాల, డివిజనుల వారిగా క్రియాశీలక కార్యకర్తల సమావేశాలు, గావ్ చలో.. బస్తి చలో అభియాన్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలిని తీర్మాణించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామచందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరి శంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైరి నాగరాజు, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, జిల్లా, మండల పదాధికారులు, మండల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ మోర్చా ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు, 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. డివిజన్‌లోని దొడ్డి కొమురయ్య (డీకే) నగర్‌లో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుండె రాజు ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య 98వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మరుపల్ల రవి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య మరణంతో తెలంగాణ రాష్ట్రం అగ్నిజ్వాలగా మారిందని, రజాకార్లతో పాటు వారి తొత్తులుగా వ్యవహరించిన దొరల అరాచకాలకు ప్రజలు ఎదిరించారని, అణచివేతకు భయపడకుండా పోరాడి వారిని ప్రతిఘటించారని అన్నారు. అటువంటి గొప్ప పోరాట యోధుని జయంతి, వర్ధంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందదాయకమని అభిప్రాయపడ్డారు. ఇంకా, ఉర్సు చెరువు ప్రాంత ప్రజలందరూ దొడ్డి కొమురయ్య పేరు పెట్టుకోవడం



వల్ల ఆయనను నిత్యం స్మరించుకుంటున్నామని తెలిపారు. జయంతి కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కుండె రాజు, కార్యదర్శి పోలేపాక మల్లేశం, కోశాధికారి కుండె కుమార్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ కార్యదర్శి వనం కుమార్, ఇతర నాయకులు మరుపల్ల గౌతం, పోలేపాక రాజన్ బాబు, శెట్టి మోహన్, గజ్జి సాంబయ్య, చీర రమేష్, దాసరి రాజు, చింతపట్ల ప్రశాంత్, నామాల రాజు, సాయినాథ్, ఎండి అమర్, తంటం నరసింహ, కవిత, రమా, విజయ, దేవమ్మ, సర్వేశం తదితరులు పాల్గొన్నారు.

## దద్దరిల్లిన విశ్రాంత ఉద్యోగుల నిరసన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** 8వ పే కమిషన్ ఏర్పాటులో భాగంగా గతంలో రిటైర్ అయిన పెన్షనర్లకు జీవన భృతి పెంపు, రాయితీలు వర్తింప చేయకూడదనే కేంద్ర ప్రభుత్వ షరతును తీవ్రంగా వ్యతిరేకిస్తూ, రిటైర్డ్ పెన్షనర్లు గురువారం హనుమకొండ హెడ్ పోస్ట్ ఆఫీస్ ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పెన్షనర్ల హక్కులను కాలరాస్తూ, రాజ్యసభ సమావేశంలో ఆమోదింపజేయాలని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను రిటైర్డ్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సిరిమల్ల సదానందం, కార్యదర్శి చాడ జైహింద్ రెడ్డి, రైల్వే పెన్షనర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ర యాదవరెడ్డి, బీఎస్ఎన్ఎల్ యూనియన్ సీనియర్ నాయకుడు జి. సంపత్ రావు తీవ్రంగా ఖండించారు. అఖిల భారత పెన్షనర్ల సంఘం పిలుపు మేరకు దేశవ్యాప్తంగా 66 లక్షల రిటైర్డ్ ఉద్యోగులకు నష్టం వాటిల్లుతున్నందున ఈ నిరసన చేపట్టారు. వందలాది మంది రిటైర్డ్ పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి, కేంద్ర ప్రభుత్వ వ్యతిరేకంగా గట్టిగా నినాదాలు చేశారు. తమ న్యాయమైన హక్కుల పరిరక్షణ కోసం, రానున్న రోజుల్లో నిరసనను మరింత ఉధృతం చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తమపై అమలు చేస్తున్న నిర్ణయాన్ని పునఃపరిశీలించి, పెన్షనర్ల హక్కులను సమర్థంగా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, లింగారెడ్డి, ఎన్.ఐజాక్, పోస్టల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రతినిధి ఆర్.సమ్మయ్య, ఆర్ఎంఎస్ నాయకులు, ఎల్ఐసీ ఎంప్లాయిస్, సెంట్రల్ ఎక్సైజ్, బీఎస్ఎన్ఎల్, రిటైర్డ్ ఆర్మీ అధికారులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

## జై బాపు, జై భీం, జై సంవిధాన్ పాదయాత్ర



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** ఏఐసీసీ పిలుపు మేరకు, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు జమ్మికుంట మండల పరిధిలోని వావిలాల, పాపక్కపల్లి గ్రామాలలో "జై బాపు, జై భీం, జై సంవిధాన్" రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమం జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వీరమనేని పరుశురామరావు ఆధ్వర్యంలో వాడవాడలా నిర్వహించబడింది. ఈ సందర్భంగా వీరమనేని పరుశురామరావు, పుల్లూరి సదానందం, పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు రాజ్యాంగ ఫలాలు అందించగల పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని, బీజేపీ ఒంటెద్దు పోకడలతో రాజ్యాంగాన్ని అవమానిస్తోందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, జిల్లా ప్రధాన కార్యదర్శి గూడెపు సారంగపాణి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, ఫిషర్మెన్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పింగిలి రాకేష్, మాజీ ఎంపిటిసి వాసాల రామస్వామి, గ్రామ శాఖ అధ్యక్షులు వానరసి జాన్, గాజనవేణి శ్రీనివాస్ యాదవ్, ఐలాపురం రవి, సిద్దు, శంకర్, ఊర సంపత్ రావు, గాజ వీర గోపాల్, బొడ్డుపల్లి సతీష్, దొగ్గల భాస్కర్, బొమ్మ శ్రీనివాస్, ఏరెడ్డి సతీష్ రెడ్డి, లింగాల రాజేశం, శూదుల రమేష్, గాజనవేన మహేష్, మాసాడి కిషన్ రావు, మర్రి సదానందం, దూస కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య జీవితం ఆదర్శనీయం

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి యోధుడిగా పేరుగాంచిన దొడ్డి కొమరయ్య ఆదర్శంగా తీసుకుని, ఆయన జీవిత స్ఫూర్తిని అనుసరించాలని అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 98వ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూమి, స్వేచ్ఛ కోసం పోరాడిన కొమరయ్య, కడవండి గ్రామంలోని కురుమ కులానికి చెందిన గొర్రెల కాపరి కుటుంబంలో జన్మించి, గొప్ప ఉద్యమానికి నాయకత్వం వహించడం గర్వకారణమని అన్నారు. అప్పటి నిజాం పాలనలో జాగీదారులు, దేశ్ముఖులు, భూస్వాముల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచిన కొమరయ్య, జనగామ తాలూకాలోని విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి ఆధీనంలో ఉన్న 60 గ్రామాల్లో అన్యాయాన్ని ప్రశ్నించారు. మొదట భూమికి సంబంధించిన పన్నుల చెల్లింపును నిలిపివేయడం ద్వారా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. దొరలు ఆయనను హతమార్చాలని కుట్రపన్నగా, తనను కాపాడుకునేందుకు 60 మంది వాలంటీర్లతో రక్షణ దళాన్ని ఏర్పాటు చేసుకున్నారు. సుమారు 200 మంది ప్రజలు దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా బయలుదేరిన సమయంలో, గడికి ఎదురుగా ఉన్న ప్రైవేటు రక్షణ దళం, మిస్కల్ అలీ



నాయకత్వంలోని దొరల బృందం కాల్పులు జరిపింది. ఆ కాల్పుల్లో దొడ్డి కొమరయ్య వీరమరణం పొందాడు. ఈ ఘటన ప్రజలను మరింత చైతన్యవంతం చేసి, చుట్టుపక్కల గ్రామాల్లో కూడా దొరలపై పోరాటాన్ని ఉద్ధృతం చేసింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ వైవి గణేష్, బీసీ వెల్ఫేర్ అధికారి రాంరెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాస్ కుమార్, జిల్లా టూరిజం అధికారి శివాజీ, గెజిటెడ్ అధికారుల సంఘం కార్యదర్శి ఆసనాల శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు రామస్వామి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు శ్యామ్, ఎన్జీవో నాయకులు మండల పరశురాములు, వివిధ కుల సంఘాల నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి:** మండల కేంద్రంలో పేర్ని రవి కురుమ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 98వ జయంతి వేడుకలను కురుమ సంఘం భవనంలో ఘనంగా నిర్వహించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నడిపి నిజాం నిరంకుశతకు బలైన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రలో అత్యంత ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు పొందిన ఆయన, బానిసత్వ నిర్మూలన కోసం గ్రామ గ్రామాన సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు చైతన్యం కలిగించారు. ఆయన పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా నాయకులు గొరిగె రవి కురుమ, మాల్ల యాకయ్య, పేర్ని వీరస్వామి, మరాటి జంపయ్య, దేవర మహేందర్, పేర్ని వెంకటేష్, పేర్ని అనిల్, దేవర కుమార్, కొలుపుల రాజు, పేర్ని శ్రీశైలం, యాదగిరి, నర్సయ్య, పేర్ని వీరయ్య, దేవర సత్తయ్య తదితర కురుమ సంఘం పెద్దలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## రేపే పరకాలలో జాబ్ మేళా

### పరిశీలించిన జిల్లా అధికారులు



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం లలిత కన్వెన్షన్ హాల్ లో నియోజకవర్గం జాబ్ మేళా ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లలిత దేవి పరిశీలించారు. వారి వెంట డాక్టర్ కొక్కొండ దివ్య , పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, సమన్వయ కమిటీ సభ్యులు సోద రామకృష్ణ, పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ సెక్రటరీలు, సిబ్బందితో సమావేశం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు డోర్నకల్ మండల ప్రత్యేక అధికారి, సర్వే ల్యాండ్ సహాయ సంచాలకులు ఎ.నరసింహమూర్తి గురువారం డోర్నకల్ మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సెక్రటరీలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి కార్యాలయంలోని ప్రజాపాలన హెల్ప్‌డెస్క్ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలను, రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్ లైన్, ఆఫ్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఈ పథకం గురించి మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ, ఎంపీఓ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
గురువారం, ఏప్రిల్ 03, 2025

# ప్రధానోపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి పాల్గొని ఎన్రోల్మెంట్ కరపత్రాలను ఆవిష్కరించారు. అలాగే, ఏఎంఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, రామకృష్ణ, కమలాపూర్ మండలం భీంపల్లి ప్రధానోపాధ్యాయులు టి.వీరస్వామి పాల్గొన్నారు. అలాగే జిల్లాలోని ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు రాంబాబు, శ్రీహరి రాజు, మంత్రి శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాజిరెడ్డి, శరత్, విశ్వనాదం, తిరుపతిరావు, సీఎస్ఆర్ మల్లిక్ ఈ శిక్షణ కార్యక్రమంలో భాగస్వామ్యులయ్యారు.

# చల్లగరిగె గ్రామ యూత్ అధ్యక్షుడిగా కట్ల మహేష్



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలోని చల్లగరిగె గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కట్ల మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు గురువారం యూత్ కమిటీని నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ఉపాధ్యక్షుడిగా దూడపాక శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిరిపేల్లి నరేష్, ప్రధాన కార్యదర్శిగా దూడపక సురేందర్, సహాయ కార్యదర్శులుగా పినగాని సురేష్, గొల్లపెల్లి నగేష్, సెక్రటరీగా అల్లె ప్రవీణ్, ప్రచార కార్యదర్శిగా గువ్వ శ్రీకాంత్ నియమితులయ్యారు. తమ ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు బండిరాజు, మండల యూత్ నాయకులు గోపగాని శివ, చిరంజీవి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన శ్రీ సాయి విద్యాలయం విద్యార్థి భూక్య తిరుపతి (తండ్రి పరమేష్) (హాల్ టికెట్ నెంబర్ 3635007) ఇటీవల విడుదలైన నవోదయ ఫలితాల్లో జవహర్ నవోదయ స్కూల్, వరంగల్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా, ట్రస్మా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్ల నాగార్జున రెడ్డి విద్యార్థిని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి విద్యాలయం కరస్పాండెంట్, వర్ధన్నపేట ముఖ్య సలహాదారులు గడ్డం వెంకటేశ్వర్లు, ట్రస్మా జిల్లా సహాయ కార్యదర్శి కోడూరు అశోక్ కుమార్, వర్ధన్నపేట జోన్ ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి హరికుమార్ పాల్గొన్నారు.

# విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి

➲ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

➲ జిల్లా విద్యాశాఖ అధికారి డి. వాసంతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఈ విద్యాసంవత్సరంలో పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాలను జిల్లా విద్యాశాఖ అధికారి డి.వాసంతి సందర్శించారు. హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ ఉపాధ్యాయులు, ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు శిక్షణ అందించగా, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ, లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్‌ను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఆమె సూచించారు. విద్యార్థులను పాఠశాల వైపు ఆకర్షించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, తల్లిదండ్రులతో సత్సంబంధాలు కొనసాగించడం ద్వారా పాఠశాలల విద్యార్థుల నమోదును పెంచాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను బోధనలో మిళితం చేస్తోందని, ఉపాధ్యాయులు ఐ.సి.టి. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భాషపై పట్టు సాధించేందుకు, విద్యార్థులను చదవడం, రాయడంలో వినూత్నంగా ఆలోచించేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులపై నమ్మకాన్ని కలిగి ఉండేలా, ఏ చిన్న సమస్య వచ్చినా ఉపాధ్యాయులను ఆశ్రయించేలా శిక్షణ తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గుణాత్మక విద్య సమన్వయకులు ఏ. శ్రీనివాస్, హనుమకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుర్ర రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్. రామకృష్ణ, రిసోర్స్ ఉపాధ్యాయులు మల్లారెడ్డి, మనోహర్ నాయక్, తాడూరి శ్రీనివాస్, సంపత్ కుమార్, రవి కుమార్, వాసుదేవరావు, బాలమురళీకృష్ణ, గ్రేసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలకు బకాయి పారితోషికాలు వెంటనే చెల్లించాలి



## ■ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి

**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ జిల్లాలో ఆశా కార్యకర్తలకు గత మూడు సంవత్సరాలుగా బకాయిపడిన లెప్రసీ, పల్స్ పోలియో, టీబీ క్యూర్ పారితోషికాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆశా జిల్లా అధ్యక్షురాలు చినగారి రాణి, కార్యదర్శి సీనపెల్లి చైతన్య నాయకత్వం వహించగా, ఆశా వర్కర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు ప్రజలకు ఆరోగ్య సంరక్షణ సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు మాతా-శిశు మరణాలను తగ్గించేందుకు కృషి చేస్తున్నారని, అలాగే క్షయ, లెప్రసీ, పల్స్ పోలియో వంటి మహమ్మారులను నివారించడంలో అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం, ఆశా కార్యకర్తల కృషిని గుర్తించకుండా, లెప్రసీ, పల్స్ పోలియో, టిబి నివారణ కార్యక్రమాలకు సంబంధించి గత మూడు సంవత్సరాలుగా వారిని పని చేయించుకొని న్యాయంగా చెల్లించాల్సిన పారితోషికాలను ఇవ్వకపోవడం దారుణమని మండిపడ్డారు. పలు దఫాలుగా డీఎంహెచ్‌ఓకి వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని, గత్యంతరం లేక ఈ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టాల్సి వచ్చిందని పేర్కొన్నారు. సుమారు రెండు గంటలపాటు ఆఫీసు ముట్టడించిన తర్వాత, సూపరింటెండెంట్ అనిల్ గారు, డీపీహెచ్ఎన్ఓ జ్ఞానసుందరి ఆశా కార్యకర్తల వద్దకు వచ్చి వినతిపత్రాన్ని స్వీకరించారు. పెండింగ్‌లో ఉన్న పారితోషికాల ఫైల్ ప్రస్తుతం కలెక్టర్ టేబుల్ మీద ఉందని, కలెక్టర్ ఆమోదం తెలుపగానే చెల్లింపులు జరుగుతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఆశా యూనియన్ కోశాధికారి సుజాత, అలాగే ఉష, పద్మ, అన్నపూర్ణ, స్వరూప, శోభ, రజిని, సుజాత, రత్నకుమారి, రజిత, రమ, మల్లీశ్వరి, గీత, రాజేశ్వరి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తి గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక





**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** హనుమకొండ జిల్లా హసన్పర్తి గ్రామ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హసన్ పర్తి జడ్. పి. హెచ్. ఎస్ హైస్కూల్లో హసన్ పర్తి పౌర సమాజం జేఏసీ చైర్మన్ అనుమాండ్ల విద్యాసాగర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో హసన్పర్తి నూతన గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులుగా పిట్టల కుమారస్వామి,కన్వీనర్ గా పెద్దమ్మ శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శిగా జన్ను కిషన్ గౌరవ అధ్యక్షులు గా గురుమూర్తి శివకుమార్ గౌరవ సలహాదారు అనుమాండ్ల విద్యాసాగర్ కో కన్వీనర్ 1)దీకొండ బిక్షపతి 2) ఎస్టి రమేష్ ఉపాధ్యక్షులు 1)దాడి రాజు యాదవ్ 2)నల్ల కిరణ్ 3)పెద్దమ్మ క్రాంతికుమార్ ముదిరాజ్ 4)మానుపాటి రమేష్ 5)గోపరాజు కుమారస్వామి 6)పోతరాజు మధుకర్ కోశాధికారిగా జనగాని ప్రశాంత్ గౌడ్ ఉపకోశాధికారి మేకల హరిశంకర్ కార్యదర్శి 1) వేల్పుల సాయికుమార్ 2)శీలం వంశీ సంయుక్త కార్యదర్శి 1)పెద్దమ్మ ప్రశాంత్ 2)వెలిగేటి తిరుపతిరెడ్డి మీడియా ఇంచార్జ్ దాడి చిరంజీవి యాదవ్ కార్యవర్గ సభ్యులు మట్టెడ సుమన్, మర్రి శ్రీనివాస్, కర్ణ కంటి రాకేష్ చారి, బొల్లు యుగేందర్, ఉప్పుల సురేందర్, సట్కూరి సంతోష్ రాజ్, గంట నగేష్ కన్నయ్య, ఓదెల కనకయ్య, ఎస్టి రాజు ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అభివృద్ధి కమిటీ అధ్యక్షులు పిట్టల కుమారస్వామి మాట్లాడుతూ.. పట్టణ సమస్యలను రిష్కరించుకోవడానికి,ప్రజా ప్రతినిధుల, ప్రభుత్వం, అధికారుల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకు వెళ్లడానికి రాజకీయాలకతీతంగా అభివృద్ధి కమిటీ పనిచేస్తుందన్నారు. గ్రామాన్ని అభివృద్ధి దశలో తీసుకవెళ్లేందుకు తమ వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఇందుకు గ్రామస్తులు కూడా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాటేటి భాస్కర్ చేనేత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు హసన్ పర్తి, హసన్పర్తి గ్రామ పురోహితులు గురుమూర్తి గురుదత్తు, BRS యూత్ నాయకులు జిర్ర అనిల్ కుమార్ దాసరి నగేష్ , విద్యార్థి జేఏసీ అధ్యక్షులు చెన్నూరి శ్రీకాంత్, బిఆర్ఎస్ నాయకులు తెలంగాణ ఉద్యమకారుడు ఇమ్మడి రాజేందర్,RTC కార్మిక సంఘం నాయకులు మేకల యుగేందర్ మొదలగువారు పాల్గొన్నారు.



# ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

➲ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా



**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా వ్యాప్తంగా ఎండిన పంటలకు నష్టపరిహారం ప్రతి ఎకరాకు రూ.50,000 ఇవ్వాలని, అలాగే దేవాదుల ప్రాజెక్టు నుంచి వరద కాలువల ద్వారా చెరువులు, కుంటలను నింపి రైతుల పంటలను రక్షించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లను పొందుపరిచిన వినతిపత్రాన్ని ఆర్డీవోకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ, వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం వాటిని ఏమ్యూరేషన్ చేసి రైతులకు ఎకరాకు రూ.50,000 పరిహారం అందించాలన్నారు. అలాగే, దేవాదుల ప్రాజెక్టు ద్వారా జిల్లాలోని చెరువులు, కుంటలను నింపడం ద్వారా సాగు నీటిని అందుబాటులోకి తేవాలని కోరారు. అంతేకాక, సంవత్సరాలుగా భూసేకరణ చేసి కూడా కాలువల నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల జిల్లాలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో కల్తీ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తున్నారని, ఇవి రైతులను మోసం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు స్పష్టమైన సమాచారం అందించే విధంగా ప్రతి ఫర్టిలైజర్ దుకాణంలో విక్రయించే విత్తనాలు, మందుల ధరలు, నిల్వ వివరాలు తెలియజేసే సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మాచర్ల సారయ్య, మంగ బీరయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఉర్సుల కుమార్, బోడ రాములు, నాయకులు కర్రె రాములు, కర్రె సత్తయ్య, కర్రె బీరయ్య, రామచొక్కం సిద్ది మల్లయ్య, అసర్ల ఐలయ్య, కర్రె శ్రీశైలం సహా 20 మంది రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా సన్ రైస్ హాస్పిటల్ ప్రారంభోత్సవం

## హాజరైన ఎమ్మెల్యేలు నాయిని, జీఎస్సార్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లా కేంద్రంలో సన్ రైస్ హాస్పిటల్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావులు ముఖ్య అతిథులుగా హాజరై హాస్పిటల్ ను ప్రారంభించారు. సన్ రైస్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రాకేష్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సేవలు సామాన్య ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా సేవలు అందిస్తున్నామని తెలిపారు. అలాగే 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. హాస్పిటల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# కేయూలో ఎల్లయ్యకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, కేయూ:** కాకతీయ విశ్వవిద్యాలయంలో అనేక హోదాలలో సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన ఎల్లయ్యను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లయ్య వివిధ విభాగాల్లో సమర్థవంతంగా సేవలందించారని, విద్యార్థులు, ఉద్యోగులతో సౌహార్దంగా మెలిగేవారని ప్రశంసించారు. ఉద్యోగ జీవితంలో విరమణ సహజమని, రిటైర్ అయినప్పటికీ ఆయన సేవలు గుర్తుండిపోతాయని అన్నారు. తదనంతరం ఎల్లయ్య స్పందిస్తూ తనకు గుర్తింపు ఇచ్చిన విశ్వవిద్యాలయ ఉద్యోగులు, అధ్యాపకులు, బోధనేతరులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ తాను రుణపడి ఉంటానని, తనను ఘనంగా సన్మానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జి.రాజేందర్ మాట్లాడుతూ, ఎల్లయ్య తన చిరకాల మిత్రుడని, చిన్ననాటి నుంచి కలిసి మెలిసి ఉంటున్నామని తెలిపారు. ఆయనపై ప్రత్యేకంగా ఒక గేయాన్ని ఆలపించి సభలో ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు కోలా శంకర్, చొక్కా రావు, నారాయణ, తిరుపతి, విష్ణువర్ధన్, శాగంటి శ్రీనివాస్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంస్కార భారతి ఆధ్వర్యంలో కవులకు సత్కారం




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ:** సంస్కార భారతి వరంగల్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కే.ఎల్.ఎన్ రెడ్డి కాలనీలోని స్పెక్ట్రా హైస్కూల్‌లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం, కవుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎంజీఎం రిటైర్డ్ ఆర్ఎంఓ, సంస్కార భారతి అధ్యక్షులు డాక్టర్ బందెల మోహన్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.పీ నిరంజన్, రాష్ట్ర సంఘటనా మంత్రి, రాష్ట్ర కార్యదర్శి గద్దం వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రముఖ పండితుడు వేదాంతం వరదరాజాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం, నగరంలోని కవులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్కార భారతి వరంగల్ మహానగర కమిటీ కొత్త కార్యవర్గాన్ని ప్రకటించింది. కొత్త కమిటీలో వరంగల్ జిల్లా అధ్యక్షునిగా కంజర్ల హరినాధరావు, ప్రధాన కార్యదర్శిగా డా. ప్రశాంత్ తదితరులు ఎన్నుకోబడ్డారు.

# గీత కార్మికుడికి గాయాలు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రానికి చెందిన గద్దమీది వెంకటేశ్వర్లు అనే గీతా కార్మికుడు ప్రమాదవశాత్తు తాటి చెట్టు మీది నుంచి జారి కింద పడ్డారు. తోటి కార్మికులు చూసి మండల కేంద్రంలోని ప్రైవేట్ హాస్పటల్ కు తరలించారు. గాయాల పరిస్థితి తీవ్రంగా ఉండడంతో వరంగల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# ఆలయ అభివృద్ధికి నగదు అందజేత



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి రామాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అదేవిధంగా గణపురం మండల కేంద్రానికి చెందిన కీర్తిశేషులు అమరాజి మొగిలి జ్ఞాపకార్థం కుమారుడు అమరాజి సతీష్, ఆలయ అభివృద్ధికి రూ.10,116 లను ఆలయ కమిటీ అధ్యక్షుడు తాళ్లపల్లి గోవర్ధన గౌడ్ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బందారు శంకర్, మూలా శ్రీనివాస్ గౌడ్, బటిక స్వామి, బూర రాజగోపాల్, మాదాసు అర్జున్, మాదాసు మొగిలి, దయ్యాల భద్రయ్య, పాండవుల భద్రయ్య, మోటపోతుల రాజన్న గౌడ్ పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వివిధ అనారోగ్య కారణాల వల్ల ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద ప్రజలకు వైద్య ఖర్చుల భరించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 7,00,000 మంజూరు చేయించారు. ఈ నిధులను మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య 14 మంది లబ్ధిదారులకు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సారయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు శిరీష, సీనియర్ కాంగ్రెస్ నేతలు గోరంటల రాజు, బిల్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సీఎం క్షమాపణలు చెప్పాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై లాఠీచార్జ్ చేసి, నిన్న జరిగిన "చలో హెచ్ సీయూ" కార్యక్రమంలో బీజేవైఎం నాయకులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించిన ఘటనను భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) వరంగల్ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా వరంగల్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం బీజేవైఎం వరంగల్ నాయకులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ భూములను, పర్యావరణాన్ని కాపాడేందుకు పోరాడుతున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడమేంటని మండిపడ్డారు. దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ మాట్లాడుతూ "చేతగాని రేవంత్ రెడ్డి పరిపాలన చేయలేకపోతే వెంటనే రాజీనామా చేయాలన్నారు.. హైదరాబాద్ మహానగరానికి ఆక్సిజన్ లాంటి హెచ్ సీయూ బయోడైవర్సిటీ పార్క్‌ను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అమ్మడం తగదన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఏ చర్యనైనా భారతీయ జనతా పార్టీ సహించదు. దీనికి తీవ్రమైన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. వరంగల్ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎర్రగొల్ల భరత వీర్ యాదవ్ మాట్లాడుతూ, "కేసీఆర్ ప్రభుత్వం యూనివర్సిటీ భూములను ప్రైవేటీకరించేందుకు నడుం బిగిస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారని విమర్శించారు. హెచ్ సీయూ భూములను లబ్ధిదారులకు అమ్మేందుకు ప్రయత్నిస్తే, బీజేవైఎం తీవ్ర స్థాయిలో ఉద్యమించి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ బాబు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి మదనకుమార్, ఎలగందుల శ్రావణ్, బీజేపీ వైస్ ప్రెసిడెంట్ ఎరుకుల రఘునాథరెడ్డి, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, ప్రణయ్, రాళ్ల బండ మున్నా, వినయ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా గూడెం శ్యామ్, అధ్యక్షుడిగా దామెర తరుణ్, ఉపాధ్యక్షుడిగా గూడెం దినేష్, ప్రధాన కార్యదర్శిగా గూడెం నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా వెల్దురు ప్రశాంత్, కోశాధికారిగా గూడెం దినేష్ ఎంపికయ్యారు. కమిటీ సభ్యులుగా తాళ్లపెల్లి రంజిత్ గౌడ్, మడిపల్లి రమేష్, శ్రీరాముల కృష్ణమూర్తి, సందెల శ్రీకాంత్, గూడెం లింగయ్య, వెల్దూరి గణేష్, గాజుల రమేష్, కానుకుంట్ల శంకరాచారి, దుర్శనపు రాజమౌళి, పసుల జగదీష్, మూల బాలకృష్ణ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల చేరలు, జిల్లా కో కన్వీనర్ సాతూరి రాజమౌళి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని గంగిరేణి గూడెం గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన చెంగిలి రాజమౌళి గత తొమ్మిది రోజుల కిందట అనారోగ్య సమస్యల రీత్యా మరణించారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగులేనందున గ్రామ యువత ఐకమత్యంతో చంగిల్లి రాజమౌళి కుటుంబానికి రూ.23,500 ఆర్థిక సహాయం అందజేశారు.

## రాష్ట్రంలో ఆకలి సమస్యలుండవు



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తొర్రూరు మండలం ఖానాపురం గ్రామంలో ప్రారంభించింది. ఈ కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఈరోజు నుంచి రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి ఆకలి సమస్య ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిత్తింటి హరీష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ మై భాషా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బచ్చలి లక్ష్మణ్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ట్రాఫిక్ ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో గురువారం డ్రంకెన్ డ్రైవ్ కేసు లో పట్టుబడిన(23) మంది వ్యక్తులను, మేజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం ఎదుట హాజరు పరచారు. దీంతో మంతుర్తి కుమారస్వామికి రూ. 2000 జరిమానా మూడు రోజుల జైలు శిక్ష పడగా పరకాల సబ్ జైలుకు పంపి, మిగతా 22 మంది వ్యక్తులకు రూ.26,500 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడిపిన పొడిశెట్టి లక్ష్మణ్ కరీంనగర్ ను కోర్టులో హాజరు పర్చగా వారికి రూ.500 జరిమానా మూడు రోజుల జైల్ శిక్ష విధించగా పరకాల సబ్ జైలుకు తరలించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాట్లు వేగవంతం చేయాలి

➲ ఎమ్మెల్యే రేవూరి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, దామెర :** మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ఏర్పాటు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెళ్ల గ్రామంలోని సాగునీటి పారుదల శాఖ భవనాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వి-హబ్ సహకారంతో ఏర్పాటు చేయనున్న పరకాల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఎమ్మెల్యే, కలెక్టర్ సందర్శించారు. శిక్షణ కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతి గురించి డీఆర్డీఓ మేన శ్రీను, సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, త్వరలో ప్రారంభించనున్న మహిళల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంలో కావాల్సిన అన్ని వనరులు, సదుపాయాలను త్వరగా అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు వివిధ ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కేంద్రం అనువుగా ఉండాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ మేన శ్రీను, ఆర్డీవో డాక్టర్ కె. నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిది



■ బీజేపీ మండల అధ్యక్షుడు రాజకుమార్

**వరంగల్ వాయిస్, పరకాల :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా పేద ప్రజలకు ఆహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకాన్ని పురస్కరించుకుని పరకాల మండలం కామారెడ్డిపల్లి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం ప్రకారం, ప్రతి ఒక్క వ్యక్తికి 6 కిలోల సన్న బియ్యం అందించబడుతుంది. ఇందులో కేంద్ర ప్రభుత్వం 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం 1 కిలో బియ్యం అందిస్తోంది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం దీనిని పూర్తిగా తమ పథకంగా ప్రచారం చేసుకుంటోందని బీజేపీ మండల అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, రేషన్ షాపుల వద్ద మోదీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సహాయాన్ని స్పష్టంగా తెలియజేసేందుకు రేషన్ డీలర్లు కూడా నరేంద్ర మోడీ ఫొటోలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మిడి మహేందర్ రెడ్డి, 62వ బూత్ అధ్యక్షుడు తండ కుమారస్వామి, శక్తి కేంద్ర ఇంచార్జి ఎదునూరి లింగయ్య, మాజీ సర్పంచ్ చిర్ర చక్రపాణి, బీజేవైఎం నాయకులు కాసగాని సాయి కుమార్, ప్రమోద్ కుమార్, తడుక సురేష్, వీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సపోర్టింగ్ స్టాఫ్‌కు వేతనాలు పెంచాలి

◆ రామ రాజేష్ ఖన్నా డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో పనిచేస్తున్న సపోర్టింగ్ స్టాఫ్‌కు వేతనాలను పెంచాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ముగ్గురు సపోర్టింగ్ స్టాఫ్ సభ్యులు పని చేస్తున్నారు. వీరిలో ఒకరు ఎం.ఎన్.ఓ, మరొకరు వాచ్‌మెన్, ఇంకొకరు స్వీపర్ హోదాలో ఉన్నారు. అయితే, వీరి హోదాను ప్రత్యేకంగా గుర్తించి, మెడికల్ అసిస్టెంట్ లేదా ఎం.ఎన్.ఓగా మార్పు చేయాలని, ఎందుకంటే చాలా మంది ఎస్.ఎస్.సి విద్యార్హత కలిగినవారే అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 824 మంది సపోర్టింగ్ స్టాఫ్ పనిచేస్తున్నారు. అయితే, వారి నెల జీతం కేవలం రూ.10,000 మాత్రమే ఉండటంతో పెరుగుతున్న ఖర్చులను తట్టుకోలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రామ రాజేష్ ఖన్నా వివరించారు. అందుకే, తెలంగాణ రాష్ట్రంలో సపోర్టింగ్ స్టాఫ్‌కు రూ.15,600, ఎం.ఎన్.ఓలకు రూ.19,500 బేసిక్ వేతనం ఇవ్వాలని, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న కాంటిజెంట్ వర్కర్లకు కనీస వేతనం రూ.19,500 చెల్లించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సన్న బియ్యం క్రెడిట్ కేంద్రానిదే



**వరంగల్ వాయిస్, దామెర:** భారతీయ జనతా పార్టీ దామెర మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్ కుమార్ ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం దామెర మండల కేంద్రంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా, గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గరీబ్ కళ్యాణ అన్న యోజన పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి పౌష్టిక ఆహారం అందించడమే లక్ష్యంగా, తెలంగాణ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వ సహకారంతో సన్నబియ్యం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా, ఒక్కొక్క వ్యక్తికి 6 కిలోల సన్నబియ్యం అందించబడుతోంది. అందులో 5 కిలోల బియ్యం కేంద్ర ప్రభుత్వం, 1 కిలో బియ్యం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరామ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రజలకు సన్నబియ్యం ఎవరు అందిస్తున్నారనే విషయాన్ని స్పష్టం చేస్తూ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కరోనా మహమ్మారి కాలం నుంచి 2029 వరకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రతి వ్యక్తికి 5 కిలోల బియ్యం ఉచితంగా అందజేస్తుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కేవలం 1 కిలో మాత్రమే ఇస్తూ, మొత్తం తామే ఇస్తున్నట్టు ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేసేందుకు రేషన్ షాపుల వద్ద ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గ కో-కన్వీనర్ మదారపు రతన్ కుమార్, శక్తి కేంద్ర ఇంచార్జి ఏక్కలదేవి రమేష్, గువ్వ సాంబయ్య, సందెసారీ సంతోష్ బాబు, కన్నె కొమురయ్య, దుప్ప ప్రభాకర్, మాదారపు సాంబయ్య, అలాగే రేషన్ బియ్యం లబ్ధిదారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
గురువారం 03 ఏప్రిల్ 2025
7

# అలా పోల్చకండి ప్లీజ్....

## నటి షాలినీ పాండే వెల్లడి

బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై తనకు ఏమాత్రం నచ్చలేదని నటి షాలినీ పాండే అన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్‌తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటానని అన్నారు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం అని షాలినీ పాండే తెలిపారు. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో సినిమాలు, సిరీస్‌లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్‌సిరీస్ 'డబ్బా కార్టెల్'. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.



## వినూత్నంగా వీడియో

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం మెగా 157–వర్కింగ్ –టైటిల్ ఉగాది నాడు పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన విషయం తెలిసిందే. చిరంజీవి కెరీర్‌లోని ఐకానిక్ పాత్రలనూ, చిత్రబృందాన్ని పరిచయం చేస్తూ వినూత్నమైన వీడియోను మంగళవారం అనిల్ రావిపూడి విడుదల చేశారు. వీడియో ప్రారంభంలో దర్శకత్వ విభాగం సభ్యులు చిరంజీవి పంచబోయే వినోదాన్ని చూసేందుకు ఆసక్తిగా ఉన్నామని చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మాస్టర్ పాటపాడుతూ ఎంట్రీ– ఇవ్వగా, చిరంజీవి 'గోదారి గట్టు–' పాట నుంచి కొన్ని లైన్లు ఆలపించి ఎంటర్‌టైన్ చేశారు. ఇలా సాంకేతిక వర్గాన్ని పరిచయం చేస్తూ సగిన వీడియ మెగా అభిమానుల్లో జోష్ నింపింది.



# రెండో సినిమా ప్రకటించిన నీహారిక


## సంగీత్ శోభన్‌తో తదుపరి చిత్రానికి రెడీ

మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల తనయ నిహారిక యాంకర్‌గా, హీరోయిన్‌గా,నిర్మాతగా టాలీవుడ్ ఇండస్ట్రీలో సత్తా చాటుతుంది. హీరోయిన్‌గా నిహారిక చేసిన సినిమా ఒక్కటి హిట్ కాలేదు. దాంతో నిర్మాత అవతారం ఎత్తింది. నిహారిక నిర్మించిన కమిటీ కుర్రోళ్లు సినిమా సంచలన విజయం సాధించింది. ముందుగా హీరోయిన్ గా, తర్వాత వెబ్ సిరీస్ ల్లో నటించిందికానీ చివరకు నిర్మాతగా స్థిరపడిరది. నిహారిక ఇటీవలే చిరంజీవి విశ్వంభర చిత్రంలోని ఓ పాటలో షూటింగ్ లో పాల్గొంది. ఈ పాటలో సాయిధరమ్ తేజ్ కూడా పాల్గొన్నారు. నటిగా మంచి మార్కులు దక్కించుకోలేకపోయిన నిహారిక నిర్మాతగా సత్తా చాటుతుంది. కొత్త డైరెక్టర్, కొత్త నటీనటులతో చిన్న సినిమాగా వచ్చిన కమిటీ– కుర్రోళ్లు చిత్రం 50 కోట్ల వసూళ్లు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.. ఇప్పుడు నిహారిక నిర్మాతగా రెండో సినిమాతో పలకరించబోతుంది. తన రెండు సినిమాని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాలో ఫుల్ ఫామ్ లో ఉన్న నటుడు సంగీత్ శోభన్ హీరోగా నటించబోతున్నాడు. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ సినిమాలతో పాటు– ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, 3 రోజెస్.. పలు సిరీస్ లతో ఫుల్ ఫేమ్ తెచ్చుకున్న సంగీత్ ఇందులో మెయిన్ లీడ్ పోషించబోతున్నాడు. సంగీత్ సోలో హీరోగా నటించనున్న తొలి సినిమా ఇదే. ఈ సినిమాకు మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఈ ఇద్దరు గతంలో నిహారికతో కలిసి పని చేశారు. నిహారిక రూపొందించిన వెబ్ ప్రాజెక్ట్స్‌లో హీరో సంగీత్ శోభన్, డైరెక్టర్ మానస శర్మ భాగం అయ్యారు. జీ5తో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ రూపొందించిన వెబ్ సిరీస్ 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి మానస శర్మ రచయితగా పని చేశారు. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'లో సంగత్ శోభన్ ప్రధాన పాత్ర పోషించారు. ఇక సోనీ లివ్ రూపొందించిన 'బెంచ్ లైఫ్'కి మానస శర్మ దర్శకురాలిగా పని చేశారు. గతంలో ఈ ముగ్గురు కలిసి అద్భుతాలు చేయగా, ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్ సరికొత్త హిస్టరీ క్రియేట్ చేసేందుకు రెడీ అయ్యారు. మన్యం రమేష్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు



# అద్భుత చిత్రరాజం.. ఆదిత్య 369

అప్పట్లో ఆదిత్య–369 అద్భుత విజయం సాధించింది. అంతేకాదు మంచి సినిమాగా నిలిచింది. దర్శకుడు సింగీతం ఖాతాలో హిట్ పడిరది. ఆయన ప్రతిభన్ మరోమరా చాటింది. ఈ సినిమా గురించి ... ఇదేం నేపథ్యంఅని అప్పట్లో చాలామంది సందేహించారు. సినిమా విడుదలై, ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లడం చూసి ఆశ్చర్యపోయారు. దాదాపు 34 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ సినిమా అధునాతన సాంకేతిక విలువలతో ఈ నెల 4న రీ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు నాటి విశేషాలు పంచుకున్నారు. హాలీవుడ్ మూవీ 'బ్యాక్ టు– ది ఫ్యూచర్' స్ఫూర్తితో 'ఆదిత్య 369' తీశానని అనడాన్ని తిప్పికొట్టారు. ది టైమ్ మిషన్' నవలను తాను కాలేజీ రోజుల్లోనే చదివానని, అందులోని ఆసక్తికర అంశాల గురించి స్నేహితులతో చర్చించేవాడిని. డైరెక్టర్‌ని అయిన తర్వాత ఆ కాన్సెప్టుతో సినిమా చేస్తే బాగుంటుందనిపించింది. ఓ సారి విమాన ప్రయాణం చేస్తుండగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో నా ఆలోచన చెప్పా. ఎంతో ఉత్సాహం చూపిన ఆయన 'ఐడియా బాగుంది. తప్పకుండా చేద్దాం' అని అన్నారు. ఇద్దరు ముగ్గురు ప్రముఖ నిర్మాతలకు ఆయనే ఈ కథ వినిపించారు. కానీ, వారికి సైన్స్ ఫిక్షన్ కాన్సెప్టు అర్థం కాలేదు. ఇదేదో ఫాంటసీ సినిమా అనుకున్నారు. కథపై నమ్మకం ఉన్న ఎస్పీబీ పట్టు వదలకుండా.. నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్‌ను సంప్రదించారు. ఆయనకు బాగా నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది. హీరో పాత్రకు ముందు నుంచీ బాలకృష్ణనే అనుకున్నాం. స్టోరీ విన్న వెంటనే ఆయన నటించేందుకు అంగీకరించారు. హీరోయిన్‌గా విజయశాంతి బాగుంటుందని కృష్ణప్రసాద్, బాలకృష్ణ అనుకున్నారు. డేట్స్ సర్దుబాటుకాకపోవడంతో ఆమె నటించలేకపోయారు. ఓ దర్శకుడు మోహిని గురించి చెప్పగా.. ఆడిషన్ చేసి కథానాయికగా ఆమెను ఎంపిక చేశాం. బాలీవుడ్ నటుడు టీనూఆనంద్‌ను ప్రొఫెసర్ పాత్రకు తీసుకున్నామని అన్నారు. టైటిల్ విషయంలో కృష్ణప్రసాద్ ఏమైనా అనుకుని ఉండొచ్చుగానీ నేను ముందు నుంచీ 'ఆదిత్య' పేరునే ఫిక్స్ అయ్యా. అలా 'ఆదిత్య 369' అయిందని సింగీతం వివరించారు.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

గురువారం, ఏప్రిల్ 03, 2025

## బొడ్డిరెడ్డికి ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ సీనియర్ నేత, టీబీఏ అధ్యక్షుడు బొడ్డిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని షటిల్ క్రీడాకారులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల గోవాలో జరిగిన 47 వ జాతీయస్థాయి వెటరన్ షటిల్ టోర్నమెంట్ లో జేఎన్ఐఎస్ క్రీడాకారులు ప్రతిభను ప్రదర్శించడంలో బొడ్డిరెడ్డి ప్రోత్సాహం ఎంతో ఉంది. మొత్తం 18 మంది క్రీడాకారులను ఈ పోటీలకు తీసుకువెళ్లి అనూహ్య ఫలితాలు సాధించడంలో ప్రభాకర్ రెడ్డి ఎనలేని కృషి చేశారు. క్రీడాకారులందరికీ మార్గదర్శకులుగా ఉండి విజయం సాధించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఆయనను జేఎన్ఐఎస్ కోర్టు వన్ క్రీడాకారులు పూల బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ షటిల్ క్రీడాకారులు గడ్డం కేశవమూర్తి, కొత్తగట్టు శ్రీనివాస్, పోరిక విజయ్ కుమార్, పీచు రాజిరెడ్డి, కోచ్ లు కూరపాటి రమేష్, మాడిశెట్టి శ్రీధర్ క్రీడాకారులు కోమాకుల మధుకర్, తమ్మడపల్లి రాజు, పూజారి విజయకుమార్, జీవన్ కుమార్, వేణు, రఘు, విక్రం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ క్రీడల్లో విశేష అనుభవం కలిగిన బొడ్డిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గోవా పర్యటనలో పూర్తి సహాయ, సహకారాలు అందించి జట్టు సభ్యులను ముందుకు నడిపారని ప్రశంసించారు.

# ధర్మారెడ్డికి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు



ప్రజా క్షేమమే లక్ష్యంగా నిరంతరం పేద ప్రజల శ్రేయస్సుకు పరితపిస్తున్న ఆదర్శ దంపతులు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి – జ్యోతిల వివాహ వార్షికోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, పత్రికా బృందం వారికి 39వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపింది.

**– వరంగల్ వాయిస్, పరకాల**

## బీజేపీ, బీఆర్ఎస్ లు.. ఫ్రస్టేషన్ లో ఉన్నాయి

- కాంగ్రెస్ ను అప్రతిష్ఠపాలు చేసేందుకు కుట్రలు
- హెచ్ సీయూ భూములపై కావాలనే రాజకీయం చేస్తున్నారు
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, ధర్మసాగర్ :** బీజేపీ, బీఆర్ఎస్ లకు చెందిన నాయకులు ఫ్రస్టేషన్ లో ఉన్నారని, పరిపాలనపై కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొని ప్రసంగించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు హెచ్ సీయూ భూములు ప్రభుత్వానివే అని చెప్పిన కేసీఆర్, పార్టీ నాయకులు ఇప్పుడు ప్రభుత్వానివి కావు అనడంలో రాజకీయం తప్ప మరొకటి లేదన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన గత ప్రభుత్వం ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా అప్పు పుట్టే పరిస్థితి లేదని ఆరోపించారు. ఆ భూములను అమ్మడం ద్వారా వచ్చే డబ్బులతో పేద ప్రజల సంక్షేమానికి ఉపయోగించాలని యత్నిస్తుంటే ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేస్తూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని విమర్శించారు. గత 10ఏళ్ల కాలంలో లక్ష కోట్లు ఖర్చు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందని, కాళేశ్వరం నుంచి నీటిని తీసుకోకుండానే అత్యధిక సంఖ్యలో వరి ధాన్యం పడించిన్నట్లు వెల్లడించారు. 5వేల కోట్ల పూర్తి చేసే దేవాదులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యం లిస్టులో తీసుకొని పనులు త్వరితగతిన పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న దేవాదులను పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగు నీరు అదించడమే ఎజెండా పని చేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## అధికారులు అప్రమత్తంగా ఉండండి

### ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రానున్న మూడు రోజులు ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున 16 సర్కిళ్ల పరిధిలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. ప్రతికూల వాతావరణంలో ఎక్కడైనా ట్రిప్పింగ్స్, బ్రేక్ డౌన్స్ సంభవిస్తే త్వరితగతిన పునరుద్దరణ చర్యలు చేపట్టాలని సూచించారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణా లిమిటెడ్, నక్కలగుట్ట, విద్యుత్ భవన్, కార్పొరేట్ కార్యాలయంలో గురువారం సంస్థ డైరెక్టర్లు, సీఈలు, జీఎంలతో కర్నాటి వరుణ్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా వినియోగదారులందరకు నాణ్యత గల నిరంతర విద్యుత్తు సరఫరా ఇచ్చేందుకు అవసరమైన అన్ని పనులను పూర్తి చేయాలని ముఖ్యంగా ప్రత్యామ్నాయ విద్యుత్ అందించే ఇంటర్ లింకింగ్ పనులు త్వరిత గతిన పూర్తి చేసేందుకు సమాయత్తం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీఈలు కె.తిరుమల్ రావు, అశోక్, బికం సింగ్, వెంకట రమణ, జీఎంలు అన్నపూర్ణ, నాగ ప్రసాద్, సురేందర్, శ్రీనివాస్, వేణు బాబు, కృష్ణ మోహన్ పాల్గొన్నారు.

# కాజీపేటపై చిన్నచూపు

- లోకో రన్నింగ్ డిపో సిబ్బంది అక్రమ బదిలీ
- పార్లమెంట్ లో గళమెత్తిన డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దక్షిణ మధ్య రైల్వేలో అతిపెద్ద డిపోగా పేరు గడించిన కాజీపేట లోకో రన్నింగ్ డిపో సిబ్బందిని వివిధ కారణాలతో అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించడంపై పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ కడియం కావ్య గళమెత్తారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా గురువారం కాజీపేట లోకో రన్నింగ్ డిపో సిబ్బంది కొరతపై ఆమె నిలదీశారు. గత 15 ఏళ్లలో 500 మందికి పైగా ఉద్యోగులను స్థానికత, వివిధ కారణాలతో రైల్వే అధికారులు విజయవాడలోని ఒక చిన్న లోకో రన్నింగ్ డిపోకు పెద్ద సంఖ్యలో ఉద్యోగులను బదిలీ చేశారని ఆరోపించారు. ప్రస్తుతం కాజీపేటకు మంజూరైన 709 మంది ఉద్యోగుల్లో కేవలం 526 మంది ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాజీపేట లోకో రన్నింగ్ స్టేషన్‌కు రైల్వే శాఖ కొత్తగా 184 పోస్టులు మంజూరు చేసినప్పటికి, పోస్టుల భర్తీకి అధికారులు ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని, దీని వల్ల ఉన్న ఉద్యోగులపై అధిక భారం పడుతుందని ఆరోపించారు. ఇప్పటికే 1100 మంది ఉద్యోగులున్న విజయవాడ లోకో రన్నింగ్ డిపోకు వీరందరినీ తరలించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ముఖ్యంగా కాజీపేట, సికింద్రాబాద్ డివిజన్లపై రైల్వే అధికారులు పక్షపాత ధోరణిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. రైల్వే శాఖ మంత్రి సమస్యను సానుకూలంగా పరిశీలించి, కాజీపేటలోని లోకో రన్నింగ్ స్టేషన్‌లో ఖాళీగా ఉన్న పోస్టుల తక్షణమే భర్తీ చేయలని కోరారు.

### నితిన్ గడ్కరీని కలిసిన కావ్య..

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రహదారులను అభివృద్ధి చేయాలని పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు గురువారం కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో కలిసి వినతిపత్రం సమర్పించారు. NH-163 జనగామ జిల్లా, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని నిడిగొండ, రఘునాథ్ పల్లి, చాగల్, చిన్నపెండ్యాల, కరుణాపురం గ్రామాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని కోరారు. కొన్ని గ్రామాల్లో సర్వీస్ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అందుకు సంబంధించి భూసేకరణ కూడా పూర్తయిందని వెల్లడించారు. వెంటనే సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి పట్టణం చుట్టూ బైపాస్ రహదారిని 2024-25 వార్షిక ప్రణాళికలో చేర్చాలని, దాని నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించాలని అభ్యర్థించారు. దీంతో ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు, భూపాలపల్లిలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి భూపాలపల్లి ప్రాంతం యొక్క పూర్తి ఆర్థికాభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ చాలా ముఖ్యమైనదని వివరించారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అభ్యర్థనల పట్ల కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. వెంటనే డీపీఆర్ తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారని కడియం కావ్య వెల్లడించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com